స్వధర్మ సేవా సంస్థ

"గ్రీన్ గుంటూరు - గ్రేట్ గుంటూరు"

మానవసేవే - మాధవసేవ

ధర్మజ్యోతి

ధర్మజ్యోతి పురస్కార గ్రహీతలు

సేవానిరతులు

సంకలన కర్త :
నన్నపనేని అయ్యన్‌రావు
జనరల్ సెక్రటరీ, స్వధర్మ సేవాసంస్థ,
మెంబరు, మహాప్రస్థాన సేవాసమితి.

ఆంధ్రప్రదేశ్ రాజధాని

అమరావతి

స్వధర్మ సేవాసంస్థ కల సాకృతి

స్వధర్మ సేవా సంస్థ

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం, బృందావన్ గార్డెన్స్,
6వ లైను, గుంటూరు-522006, సెల్ : 9491478884

"మానవసేవే-మాధవసేవ"అనే సదాశయంతో గుంటూరులో పురప్రముఖులచే 2008 సం॥లో నెలకొల్పబడిన సంస్థ, స్వధర్మ సేవా సంస్థ.

"క్రియాసిద్ధిః సత్త్వే భవతి మహతాం నోపకరణే"

మంచి లక్ష్యాన్ని ముందు నిర్ధారించుకుంటే కావలసిన ఉపకరణాలు వాటంతటవే సమకూరుతాయి అనే విశ్వాసంతో స్వధర్మ సేవా సంస్థ ఈ బృహత్ ప్రయత్నానికి పూనుకొన్నది.

సంస్థ ఆశయాలు:

1) గ్రంథాలయాలను తీర్చిదిద్దుట
2) నిరక్షరాస్యత నిర్మూలన
3) పర్యావరణ పరిరక్షణ
4) ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ
5) సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రోత్సాహం
6) మూఢవిశ్వాసాలను పారద్రోలడం
7) శ్మశానాల ఆధునీకరణకు సహకారాన్నందించడం
8) '**గ్రీన్ గుంటూరు-గ్రేట్ గుంటూరు** ' అనే ప్రధాన ఆశయంతో కూడా పనిచేయడం

మొదలైనవి.

పిల్లలు, తల్లులకు ఉపయుక్తంగా ఉంటుందనే ఉద్దేశంతో "ప్రథమచికిత్స" అను పుస్తకమును ప్రచురించి, దానికి తోడుగా ప్రాథమిక మందుల పెట్టెను జతపరచి 300 విద్యాసంస్థలకు ఉచితముగాను, పురజనులకు స్వల్పధరకు ఇచ్చాము.

నగరంలో నిరుపేదలు నివసిస్తున్న "జన్మభూమినగర్" లో గల ప్రాథమిక పాఠశాలను "చైతన్య స్ఫూర్తి" అనే స్వచ్ఛంద సంస్థతో కలసి దత్తత తీసికొని, ఆ పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించుటకు కృషి చేస్తున్నాము.

చల్లా రాజేంద్రప్రసాద్ గారు ఇచ్చిన 3 (మూడు) లక్షల వితరణతో వారి తండ్రి స్వర్గీయ శ్రీ జస్టిస్ చల్లా కొండయ్య గారి పేరుతో భవన నిర్మాణం చేయటం జరిగింది. ఆ తర్వాత స్థలం చుట్టూ ప్రహరీగోడ కట్టుటకు, పెద్దగోతులను పూడ్చి మెరక చేయుటకు, విద్యుద్దీకరణకు, సీలింగ్ పంకాలకు, మరుగుదొడ్డి నిర్మాణానికి సుమారుగా 4 లక్షలు ఖర్చు చేశాము.

ధార్మిక, సంఘ సేవాభిలాషులయిన కొందరు పెద్దలు, సంస్థల, సహాయంతో దుస్తులు, పలకలు, పుస్తకములు వగైరా ఉచితముగా అందిస్తున్నాము.

వాటితో పాటుగా "గుంటూరు గాంధి" వారసులు తమ సంస్థ ద్వారా పిల్లలందరికి పౌష్టిక ఆహారం తప్పనిసరి అనే ఆశయంతో, చాలా కాలం ప్రతి రోజు కోడిగ్రుడ్లు/ పండ్లు / బిస్కెట్లు ఇచ్చారు. ఇందువలన ఈ పాఠశాల పిల్లల సంఖ్య, హాజరు కూడా గణనీయంగా పెరిగాయి.

ధార్మిక, సంఘ సేవా కార్యక్రమాలను చేపట్టి, వెలుగు చూపిస్తూ, విలువైన సేవలందిస్తూ సమాజానికి ఎంతో ఉపకారం చేస్తున్న వదాన్యులను 2008వ సంవత్సరం నుండి "ధర్మజ్యోతి" బిరుదుతో ఒక కిలో వెండి జ్ఞాపికతో గౌరవించటం ఈ సంస్థ నిర్వహిస్తున్న విశేష కార్యక్రమం. 2012 నుండి బిరుదుతో పాటుగా లక్షరూపాయల నగదును కూడ బహూకరించటం జరుగుతున్నది.

దేశపటంలో గుంటూరు నగరానికి సముచిత స్థానాన్ని కల్పించడానికి ఈ సంస్థ కృషి చేస్తున్నది. రాష్ట్ర విభజనకు పూర్వం విభజన అనివార్యం అయినట్లయితే రాజధాని కావటానికి అన్ని అర్హతలున్న గుంటూరు పట్టణానికి గుర్తింపు తీసుకురావటానికి వేల బ్రోచర్లు, కరపత్రాలు(పాంప్లెట్లు) ముద్రించి, ప్రచారంలో భాగంగా ప్రజానీకానికి పంచటం జరిగింది. అంతేకాకుండా ఈ సందర్భముగా ఒక "రౌండ్‌టేబుల్ సమావేశం" కూడా నిర్వహించాం.



శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి
జనరల్ సెక్రటరీ

జులై 15, 1948 సంవత్సరంలో గుంటూరుజిల్లా బేతపూడి గ్రామంలోని వెంకటసుబ్బమ్మ, వీరరాఘవయ్య దంపతులకు జన్మించిన శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి ప్రాథమిక విద్య రేపల్లెలో జరిగింది. న్యూ ఢిల్లీలోని ప్రపంచ ప్రఖ్యాత సంస్థ "ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో" టెక్నీషియన్‌గా ప్రత్యేక శిక్షణ పొందిన ఆయన గుంటూరు వైద్యశాలలో కార్డియాలజీ టెక్నీషియన్‌గా పలు సంవత్సరాలు సేవలందించి మంచి గుర్తింపు పొందాడు. ఆ సమయంలోనే ఆయన ఇండో-సోవియట్ కల్చరల్ సొసైటీ, వరల్డ్ పీస్ కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్ సంస్థలలో సభ్యుడిగా సేవలందించారు. ఆయన వామపక్ష భావజాలంకల వారు. 31.07.2006న పదవీ విరమణ చేశారు.

మానవ జీవితంలో ఎన్నో కొత్త సంఘటనలు చోటు చేసుకుంటాయి. మలుపులు తిరుగుతాయి. మానవత్వానికి దర్పణం, నీతి నియమాలకు నిలువెత్తు సంతకంగా కీర్తించబడి, మహా మనీషి 'గుంటూరు గాంధీ' గా పేరొందిన వట్టికూటి వేంకట సుబ్బయ్యగారి ప్రభావం పడి, శ్రీ గుమ్మడి ఆలోచనా ధోరణులను, సైద్ధాంతిక దృక్పథాలను గణనీయంగా మార్చివేసింది. ఆ మార్పే శ్రీ గుమ్మడి అసంఖ్యాకమైన ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టటానికి శ్రీకారం చుట్టింది. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో నరక సదృశంగా వున్న చెరువును పూడ్చి ఒక ఆలయంగా మార్చటం, అన్నమయ్య పార్కు, అన్నమయ్య కళావేదిక, అన్నమయ్య గ్రంథాలయం, తటాకం, బాలాజీ కళ్యాణ మండపం, మొదలగు విశేష కార్యక్రమాలు రూపుదిద్దుకోవటంలో శ్రీ గుమ్మడి పాత్ర అనన్య సామాన్యం. హారంలోని దారంలాగా శ్రీ గుమ్మడి వీటన్నిటి సమాహారం.

వీటన్నిటినిమించి శ్రీ గుమ్మడి సమాజానికి అందించిన సేవ

శ్మశానవాటికల ఆధునీకరణ. దానికి కూడా శ్రీ వెంకటసుబ్బయ్య గారినే ఆదర్శంగా తీసికొన్నాడు శ్రీ గుమ్మడి. గుంటూరు పట్టణంలోని స్థంబాలగరువులోని 'వైకుంఠ మహాప్రస్థానం', బొంగరాలబీడులో 'పితృవనం', 'శ్రీనివాసరావుతోటలోని 'కైలాస భూమి' నిర్మాణాలకు ఆయనే ఆద్యులు, బాధ్యులు. ఒక ఉద్యమరూపంలో గుంటూరు పట్టణం, జిల్లాలోనే కాకుండా, సమీప జిల్లాలలో మహాప్రస్థాన నిర్మాణాలకు కారణభూతులు శ్రీ గుమ్మడి, ఆయన ప్రధాన కార్యదర్శిగా నిర్వర్తించిన మహాప్రస్థాన సేవాసమితి అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ఇప్పుడు మన జిల్లాలోని అనేక పట్టణాలలో, పల్లెలలో మహాప్రస్థానాల ఆధునీకరణ జరిగింది.

అందరికి తలలో నాలుకవలె వ్యవహరిస్తూ 'మన ఉమ్మడి సంపద గుమ్మడిగా' గుర్తింపు పొందారు శ్రీ గుమ్మడి. ఆరోగ్యం అల్పం - ఆశయం అనంతం. ఆరోగ్య కారణంగా ఎన్ని అడ్డంకులు వచ్చినా అధిగమించి ఆశయ సాధనకై శ్రమించాడు గుమ్మడి. దేవాలయ స్థాపన, మహాప్రస్థానం లాంటి అసాధ్యాలను సుసాధ్యం గావించడంలో తనవంతు పాత్రను పోషించిన అసాధ్యుడు శ్రీ గుమ్మడి. గుంటూరు పట్టణం అన్నమయ్య పార్కులో మొట్టమొదటిసారిగా 'తెలుగు తల్లి' విగ్రహం స్థాపించింది ఆయన ప్రోద్బలంతోనే. ఆయనకు శ్రీమతి విజయలక్ష్మి తోడ్పాటు ఎంతగానో ఉంది.

'సేవారత్న' బిరుద గ్రహీతలైన వీరికి విశాఖపట్టణం వసంత మోహన ఫౌండేషన్‌వారి విశిష్ట సేవా పురస్కారం, రోటరీక్లబ్ అవార్డు, తెనాలి, గుంటూరు పట్టణాలలో పౌర సన్మానాలు, వారి సేవానిరతికి నిదర్శనాలుగా నిలుస్తాయి. 2016లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వారిని 'ప్రతిభా పురస్కారం'తోను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018లో 'కళారత్న' (హంస) పురస్కారంతోను సత్కరించింది.

అంతటి మహామనిషి, అనారోగ్యంలో కూడా అలుపెరుగకుండా పోరాడి అనంత విశ్వంలో కలసిపోయాడు. స్వధర్మసేవా సంస్థ రూపశిల్పి, జనరలు సెక్రటరీ, దానికి కర్త, కర్మ, క్రియ అయినటువంటి శ్రీ గుమ్మడి రాధాకృష్ణ మూర్తిగారికిదే మా శ్రద్ధాంజలి.

డా. కడియాల వాసుదేవరావు

ఉపాధ్యక్షులు

డాక్టర్ కడియాల వాసుదేవరావుగారు కృష్ణాజిల్లా కాటూరు గ్రామంలో సీతారామమ్మ, శివరామగోపాలకృష్ణయ్య దంపతులకు జూలై 15, 1940 సంవత్సరంలో జన్మించారు. ప్రాధమిక విద్య స్వగ్రామం కాటూరులోను, కాలేజీ విద్య ఏలూరులోను జరిగింది. తనకు అక్షరాభ్యాసం ప్రముఖ కవి, అభ్యుదయవాది శ్రీ నార్ల చిరంజీవి గారిచే కావింపబడటం ఎంతో అదృష్టంగా చెప్పుకుంటారు వాసుదేవరావు గారు.

గుంటూరు మెడికల్ కాలేజి నుండి యం.బి.బి.యస్., యం.డి. (బయోకెమిస్ట్రీ) డిగ్రీలను పొందారు. వారికి 1963 సంవత్సరంలో ప్రముఖ వైద్యులు డా. చల్లపల్లి సాంబశివరావుగారి కుమార్తె సత్యభామతో వివాహం జరిగింది.

ఆయన 1965 నుండి 1981 వరకు, బయోకెమిస్ట్రీ డిపార్టుమెంట్ డిమాన్‌స్ట్రేటర్‌గా, ట్యూటర్‌గా, అసిస్టెంటు ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా గుంటూరు మెడికల్ కాలేజీలో తమ విశిష్ట సేవలందించారు. ఆ తర్వాత కన్సల్‌టెంట్ బయోకెమిస్ట్‌గా, సాల్మానియా మెడికల్ కాంప్లెక్స్, బహారిన్ దేశంలో 14 సం॥లు పనిచేశారు. అలాగే విజయవాడ సిద్ధార్ధ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ & హెడ్ ఆఫ్ డిపార్టుమెంట్‌గా, కాలేజి వైస్ ప్రిన్సిపాల్‌గా పలు సంవత్సరాలు పనిచేసి, కాలేజి యాజమాన్యం, విద్యార్థుల ప్రశంసలు పొందారు. ఎంతో నైపుణ్యంగల టీచరుగా, ప్రొఫెసరుగా, ఎగ్జామినర్‌గా, అడ్మినిస్ట్రేటర్‌గా పేరుపొందారు. మంగళగిరిలోని యన్.ఆర్.ఐ. మెడికల్ కాలేజీలో కూడ కొన్ని సంవత్సరాలు పనిచేశారు. ఆలిండియా రేడియోలో ఆరోగ్య విషయముల మీద 23సార్లు ప్రసంగించారు. గుంటూరు మెడికల్ కాలేజి మాగజైన్‌కు ఎన్నో సంవత్సరాలు

ఎడిటరుగా వున్నారు. వారు పలు ఆరోగ్యవిషయాలు, సమస్యల మీద ఆంగ్లంలో 26 పేపర్లు ప్రచురించారు.

వారిని 'మాష్టారు' అని ఆత్మీయంగా పిలుచుకునే శిష్యగణం దేశంలోను, విదేశాలలోనూ ఎందరో వున్నారు. అణకువగా, అందరికి అందుబాటులో వుండే గురువు, గుణశీలి.

వారు సాహితీ పిపాసి, మంచి రచయిత కూడ. ఆయన గురువుగా భావించే డా॥ కాసరనేని సదాశివరావుగారు నారుపోసి, నీరు పోసిన సంస్థ 'సాహితీ సదస్సు'లో జరిగే నెలనెలా కార్యక్రమాలకు వీరి హాజరు తప్పనిసరి. ఆ సందర్భంగానే వారు తుమ్మల సీతారామమూర్తిగారు, గుర్రం జాషువాగారు, జమ్మలమడక మాధవరాయశర్మగారు, కరుణశ్రీ, అమరేంద్ర, సంజీవ్‌దేవ్ లాంటి వారిని తరచుగా కలుసుకోవటం, వారి జిజ్ఞాసా పూర్వక ప్రసంగాలు వినే అదృష్టం కలిగిందంటారు. అలాగే మిత్రులు సి.వి.యన్.ధన్‌గారి ఆఫీసులో అగ్రశేణి రచయితలయిన రావిశాస్త్రి, బీనాదేవి, కాళోజీ, కుందుర్తిగారిని కలుసుకొని, వారితో చర్చలు జరిపే భాగ్యం పొందానంటారు. వాటి ప్రభావంగానే, కొన్ని రచనలు చేసే అలవాటు సంక్రమించిందట, అవి దిన, మాస పత్రికలలో ప్రచురింపబడ్డాయట. ఈమధ్యనే, వారి కవితాసంచిక 'భావజలధి', నవల 'మహాసంకల్పం'ను సాహితీప్రియులు డా॥ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తిగారి ఫౌండేషన్ ద్వారా ప్రచురించటం జరిగింది.

మా స్వధర్మ సేవాసంస్థ 2008లో శ్రీ గుమ్మడి పూనికతో స్థాపించబడి, ఆయన జనరల్ సెక్రటరీగా, డా. వాసుదేవరావు ఉపాధ్యక్షులుగా ప్రకాశవంతంగా కొనసాగుతున్న తరుణంలో, శ్రీ గుమ్మడి మరణ విషాదం నుండి మేము తేరుకోకముందే, దాదాపు ఏడు నెలల కాల వ్యవధిలో ఫిబ్రవరి 8, 2019న డా. వాసుదేవరావుగారు పరమపదించటం, మా సంస్థ సభ్యులను ఎంతో క్రుంగదీసింది. వీరిద్దరి మరణం, వారి కుటుంబ సభ్యులకే కాకుండా, పట్టణ ప్రజలకు, సేవారంగానికి, విశేషించి స్వధర్మ సేవా సంస్థకు పూరించలేని లోటు.

సంస్థ కార్యవర్గ సభ్యులు- 2018

డా. మద్దినేని గోపాలకృష్ణ
అధ్యక్షులు

డా. కడియాల వాసుదేవరావు
ఉపాధ్యక్షులు

శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి
జనరల్ సెక్రటరీ

శ్రీ మోదుగుల రవికృష్ణ
జాయింట్ సెక్రటరీ

శ్రీ లంకా సూర్యనారాయణ
కోశాధికారి

సభ్యులు

శ్రీ పావులూరి శ్రీనివాసరావు

శ్రీ కొర్రపాటి రామారావు

శ్రీ నన్నపనేని అయ్యన్‌రావు

శ్రీ తూనుగుంట్ల సుందరరామయ్య

శ్రీ త్రిపురమల్లు అరుణ్‌కుమార్

శ్రీ గొంది చంద్రమౌళి

శ్రీ తూనుగుంట్ల జగన్‌మోహనరావు



శ్రీ కాకరపర్తి వెంకట నారాయణరావు

శ్రీ దేవినేని కరుణ చంద్రబాబు

గతంలో ఈసంస్థకు 2008 నుండి 2014 వరకు డా. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తిగారు అధ్యక్షులుగా, శ్రీ మండవ వెంకట్రామయ్య ఉపాధ్యక్షులుగా, శ్రీ యడవల్లి శివరామకృష్ణారావు, శ్రీ కుడితిపూడి రవీంద్రబాబు, శ్రీ వట్టికూటి వెంటేశ్వరరావులు కమిటీ సభ్యులుగా పనిచేశారు.

గత సంవత్సరాలలో మా 'ధర్మజ్యోతి' బిరుదు పురస్కార గ్రహీతలు

శ్రీ పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు గారు 2008

వదాన్యులు, వితరణశీలి అయిన పోలిశెట్టి సోమసుందరం గారి నాలుగో కుమారుడు శ్రీ హరిప్రసాదరావు. 1941లో జననం. మద్రాసు లోని వివేకానంద కళాశాలలో పట్టభద్రులయ్యారు. వాణిజ్యవేత్తగా రాణించటమే కాకుండా, విద్యారంగానికి ఎంతో కృషిచేశారు. గుంటూరు టి.జె.పి.యస్. కళాశాల, దాని అనుబంధ సంస్థలలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పటానికి తోడ్పడ్డారు. ఎన్నో ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలకు ఇతోధిక ఆర్థిక సహాయం అందజేశారు. తల్లిదండ్రుల పేరున ఒక ట్రస్టును ఏర్పరచి, దాని ద్వారా వారి స్వగ్రామమైన కాట్రపాడులో ఆరోగ్య కేంద్రం, పశువైద్య కేంద్రం నిర్మించి ప్రజాహిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. "**శారదా పరమేశ్వరి అన్నదాన పథకం**" నిరంతరం నిర్వహిస్తూ అన్నార్తులకు, రోగులకు అమూల్యమైన సేవలందిస్తున్నారు. ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో 500 మంది రోగులకు, వారి సహాయులకు నిత్యాన్నదాన పథకం అమలు పరుస్తున్నారు. స్వధర్మ సేవా సంస్థ వారు "**ధర్మజ్యోతి**" బిరుదును ప్రథమంగా వీరికి ప్రదానం చేయడం గొప్ప శుభసూచకం.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

మా ప్రథమ పురస్కార ప్రదానోత్సవం 04-08-2008న జరిగింది. సభకు ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ కళ్ళం హరనాథరెడ్డిగారు అధ్యక్షత వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనకారులు శ్రీ చాగంటి కోటేశ్వరరావు, ప్రముఖ ఆడిటరు శ్రీ వడ్లమాని ఉమామహేశ్వరరావు, శ్రీ గద్దె మంగయ్య (సెక్రటరీ & కరస్పాండెంట్, ఆర్.వి.ఆర్. కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్), శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ, (భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు) శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి, (సంస్థ ప్రధాన కార్యదర్శి) మున్నగు వారు పాల్గొన్నారు. శ్రీ లంకా సూర్యనారాయణ సంస్థ ట్రెజరరు వందన సమర్పణ గావించారు

శ్రీ గ్రంథి సుబ్బారావు గారు 2009



ధైర్యమే సుబ్బారావు గారి పెట్టుబడి. 1957లో వక్కపొడి వ్యాపార రంగంలో ప్రవేశించి 1960లలో క్రేన్ సుబ్బారావుగా మారిపోయారు. వారి దృష్టిలో ఆలయాలు నాలుగు : **దేవాలయం, విద్యాలయం, గ్రంథాలయం, వైద్యాలయం**. వాటి స్థాపన, నిర్వహణ చేపట్టి మానవ సేవలో చరితార్థులైనారు. అనేక సంస్థలకు, వ్యక్తులకు ఉదారంగా విరాళాలు ఇచ్చి మహాదాతగా పేరొందారు. ఆసేతు హిమాచలం ఎన్నో దేవాలయాలకు వారిచే నిర్మించబడిన రాజగోపురాలు వారి కీర్తికి జయపతాకలు. లెక్కపెట్టడం సాధ్యం కాని యజ్ఞ యాగాదులు నిర్వహించారు. అన్నదానం, యజ్ఞం వారికి ఎంతో ప్రీతిపాత్రం. అయ్యప్పలకు, వృద్ధులకు వారు చేసిన సేవ లోకోత్తరం. సాధారణ జీవనం, అసాధారణ భావనం - వీటికి ప్రతినిధిగా నిలిచే ధర్మజ్యోతి గ్రంథి సుబ్బారావు గారు తెలుగుజాతికి గర్వకారణం. గుంటూరు చరిత్రలో వారి అధ్యాయం సువర్ణాక్షర శోభితం.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

11-07-2009న శ్రీ గ్రంథి సుబ్బారావు గారికి మా రెండవ "ధర్మజ్యోతి" పురస్కారం అందజేయటం జరిగింది. సభకు డా॥బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి (సంస్థ అధ్యక్షులు) అధ్యక్షత వహించగా, శ్రీ రాయపాటి మోహనసాయికృష్ణ (గుంటూరు నగర మేయరు) పురస్కార ప్రదానం గావించారు. శ్రీ పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు (2008 ధర్మజ్యోతి పురస్కార గ్రహీత) శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి, శ్రీ సిహెచ్. మస్తానయ్య (శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు) సభలో పాల్గొన్నారు.



డాక్టర్ కాసరనేని సదాశివరావు గారు 1923లో గుంటూరు జిల్లా తక్కెళ్లపాడు శివారు గ్రామమైన రామచంద్రపురంలో జన్మించారు. ఏకసంథాగ్రాహి. గుంటూరు పట్టణం హిందూ, ఏ.సి. కళాశాలలో చదివారు. విశాఖపట్టణం ఆంధ్రవైద్య కళాశాలలో, ఎం.బి.,బి.ఎస్. తర్వాత జనరల్ సర్జరీలో యం.యస్. డిగ్రీ కూడ తీసికొని స్వర్ణపతకం పొందారు. 1949లో డా. జయప్రదాంబ గారితో వివాహం జరిగింది. 1951లో ప్రజావైద్యశాలను స్థాపించి, గుంటూరు పట్టణ, జిల్లా వాసులకు విశిష్టసేవలందించారు. గొప్ప మానవతావాది, శస్త్ర చికిత్సలో అపార నైపుణ్యం కలవారు. విద్యార్థుల నుండి రుసుము తీసుకునే వారు కాదు.

వైద్యవృత్తిలోనే కాకుండా, విద్యా సాహిత్య, రాజకీయ రంగాలలో కూడ బహు రాణించారు. 1968లో జె.కె.సి. కళాశాల స్థాపనలో వారి పాత్ర ఎంతో వుంది. ఆ సంస్థకు కార్యదర్శిగా పనిచేసిన డాక్టరు గారు, ఎన్నో వేల కుటుంబాల ఉన్నత విద్యాభ్యాసానికి ఆద్యులయ్యారు. ఆచార్య రంగా గారికి అనుంగు శిష్యులు, యన్.టి. రామారావు గారికి సన్నిహితులు. 1985లో పెదకూరపాడు శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. డా. జయప్రదాంబగారు గతించాక, ఆమె పేరుతో డిగ్రీ కళాశాలను స్థాపించారు. ఈ బహుముఖ ప్రజ్ఞావంతునికి 2010లో ధర్మజ్యోతి ప్రధానం చేసి స్వధర్మసేవాసంస్థ తనని తాను సన్మానించుకొన్నది.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

గుంటూరు పట్టణ ప్రముఖ వైద్యులు డా. కె. సదాశివరావుకు 11-07-2010న "ధర్మజ్యోతి" పురస్కారం గావించారు.ఆ సభకు డా. బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి అధ్యక్షత వహించగా నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి కార్యదర్శి డా. మద్దినేని గోపాలకృష్ణ పురస్కార ప్రదానం చేశారు. డా. ఎన్. జయప్రకాశ్ నారాయణ(శాసనసభ్యులు), శ్రీ గ్రంథి సుబ్బారావు, డా.పాటిబండ్ల దక్షిణామూర్తి,

శ్రీ వి. ఉమామహేశ్వరరావు, ప్రొ. కె. వాసుదేవరావు, శ్రీ గుమ్మడి, శ్రీ సిహెచ్. మస్తానయ్య గారలు సభలో పాల్గొన్నారు.

కళాతపస్వి శ్రీ కాశీనాథుని విశ్వనాథ్‌గారు 2011

తెలుగు జాతికే వెలలేని ఆభరణం కళాతపస్వి శ్రీ కాశీనాథుని విశ్వనాథ్‌గారు. కె. విశ్వనాథ్ గారు 1930 సం॥లో రేపల్లె తాలుకా పెదపులివర్రు గ్రామంలో జన్మించారు. హైస్కూలు విద్య విజయవాడలోను, కళాశాల విద్య (బి.ఎస్.సి) గుంటూరులో జరిగింది.

"తోడికోడళ్ళు" చిత్రానికి సాంకేతిక నిపుణుడిగా ఆరంభమైన ఆయన సినీజీవితం, **"ఆత్మగౌరవం"** సినిమాతో దర్శకుడి స్థాయికి ఎదిగింది. ఆ తర్వాత ఆణిముత్యాలు లాంటి ఎన్నో సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన అందించిన **"శంకరాభరణం"** చిత్రం తెలుగు చలన చరిత్రలో ఒక మైలురాయిగా నిలబడటమే కాకుండా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోను ప్రత్యేక స్థానం సంపాదించుకున్నది. **సిరిసిరిమువ్వ, సప్తపది, సాగరసంగమం** - ఇలా మంచికథ, అద్భుతమైన సంగీతం, సంప్రదాయ విలువలకు ప్రాధాన్యత నిచ్చే 50కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. రాజీపడని ధోరణిలో, ఉన్నత ప్రమాణాలు పాటించటం వీరి ప్రత్యేకత.

ప్రేక్షకుల రసాభిరుచి స్థాయిని పెంచిన విశ్వనాథ్‌గారిని **రఘుపతి వెంకయ్య** అవార్డు, **పద్మశ్రీ** బిరుదులు వరించి వచ్చాయి. నడచి వచ్చిన నందులు, వెతుక్కుంటూ వచ్చిన పురస్కారాలకు లెక్కలేదు.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

ప్రముఖ చలన చిత్ర దర్శకులు, కళాతపస్వి, పద్మశ్రీ కె.విశ్వనాథ్‌కు 27-08-2011న **"ధర్మజ్యోతి"** పురస్కారం, అసంఖ్యాక ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య, సిద్ధార్థ అకాడమీ, విజయవాడ అధ్యక్షులు శ్రీ యస్.వి.

విష్ణువర్ధనరావు చేతుల మీదుగా అందుకున్నారు. సభకు శ్రీ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. శాసనమండలి సభ్యురాలు శ్రీమతి నన్నపనేని రాజకుమారి, సంగీత విద్వాన్ డా. భూసురపల్లి వేంకటేశ్వర్లు, శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి, ప్రొ. కె. వాసుదేవరావు, శ్రీ సిహెచ్. మస్తానయ్య ఇంకా ఇతర పట్టణ ప్రముఖులు ఈ సభలో పాల్గొన్నారు.

శ్రీ విద్వాన్ గోగినేని కనకయ్య గారు 2012



1917 సంవత్సరంలో జనవరి 4న జన్మించిన గోగినేని కనకయ్యగారు తాడికొండ గ్రామానికే కాకుండా గుంటూరు జిల్లాకే ఒక మణిభూషణం. ఆయన ప్రసిద్ధ గాంధేయవాది. జాతీయ ఉద్యమంలో విశిష్ట కృషి చేసిన వ్యక్తి. సంస్కృతం, తెలుగు భాషలలో వారికి అపార పాండిత్యం ఉన్నది. సాంస్కృతిక సంపన్నులు. గుంటూరు జిల్లా విద్యారంగ చరిత్రలో కనకయ్యగారిది సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు. అందుకు నిదర్శనం తాడికొండ గ్రామం. రాజకీయ, వాణిజ్యరంగంలో కూడా వారికి విశేష అనుభవం ఉన్నది. ఎన్నో మంచి కార్యక్రమాలకు ఆర్థికంగా చేయూతనిచ్చిన వితరణశీలి. స్వధర్మ సేవాసంస్థ 'ధర్మజ్యోతి' బిరుదును, లక్ష రూపాయల పురస్కారాన్ని అందుకున్నారు.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

మా పంచమ "ధర్మజ్యోతి" పురస్కారం పలు విద్యాసంస్థల స్థాపకుడు, ఆధ్యాత్మిక భావశీలి, విద్యాన్ శ్రీ గోగినేని కనకయ్య స్వీకరించారు. అన్నమయ్య కళావేదిక మీద వేడుక జరిగినా, వయోభారం, అనారోగ్య కారణంగా శ్రీ గోగినేని కనకయ్య వేదిక వద్దకు రాలేని పరిస్థితిలో సంస్థ సభ్యులు, పురస్కార ప్రదాత శ్రీ రాయపాటి సాంబశివరావు (పార్లమెంటు సభ్యులు) ఇతర అతిథులు శ్రీ కనకయ్య నివాసమునకు వెళ్ళి "ధర్మజ్యోతి" పురస్కార ప్రదానం గావించారు. ఆ తర్వాత అన్నమయ్య కళావేదిక మీద జరిగిన సభలో పురప్రముఖులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం గావించారు.

డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు గారు 06-06-1936న కారంచేడులో సంపన్న కుటుంబంలో జన్మించారు. 1960సం॥లో నమ్మినబంటు చిత్రం ద్వారా చలనచిత్ర రంగంలోకి ప్రవేశించారు. 1964లో తను నిర్మించిన "**రాముడు భీముడు**" చిత్రంలో నూతన వరవడిని సృష్టించారు. ఆ తర్వాత ప్రేక్షకుల మదిలో కలకాలం నిలిచిపోయే ఎన్నో చిత్రాలను నిర్మించారు.

135 చిత్రాలను నిర్మించి "**గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్**"లో స్థానం సంపాదించారు. అలాగే "**లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు**"లో వారిది శాశ్వత స్థానం. అద్భుత విజయాలను, అవార్డులను వారు స్వంతం చేసుకున్నారు. **రఘుపతి వెంకయ్య** అవార్డు, **దాదా సాహెబ్ ఫాల్కే** అవార్డులు కూడా వారిని వరించాయి. పార్లమెంట్ మెంబర్‌గా కూడా రాణించి "**ఉత్తమ పార్లమెంటేరియన్**"గా అవార్డు స్వీకరించారు. తన నియోజక వర్గంలో గొప్ప అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం వారు వారికి గౌరవ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. 2013లో భారత ప్రభుత్వం వీరిని ప్రతిష్టాత్మకమైన "**పద్మభూషణ్**" బిరుదుతో సత్కరించింది.

చిత్ర నిర్మాతగానే కాకుండా వారు పలువిధాలుగా చలనచిత్రరంగంలో ఒక చక్రవర్తి స్థానం పొందగలిగారు. వారు స్థాపించిన 'రామానాయుడు స్టూడియోలు' బహుముఖాలుగా కీర్తి నార్జించాయి. తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడం, మళయాళం, హిందీ, ఒరియా, మరాఠీ, బెంగాలీ మొదలైన భాషలలో చిత్రాలను నిర్మించిన విశిష్టత వారిది. కొన్ని వేలమందికి ఉపాధి సౌకర్యాలు కల్పించటం, సామాజిక కార్యక్రమాలకు చేయూత నివ్వడం, పేదరిక నిర్మూలనకు కృషి చేయడం డాక్టర్ రామానాయుడుగారి విజయాలుగా భావించవచ్చు. "**మూవీ మొఘల్**" "**చలనచిత్ర చక్రవర్తి**" అని కూడ పేర్కొంటారు. పల్లె నుండి ప్రపంచ స్థాయికి ఎదిగి, తెలుగు చలనచిత్ర రంగంలో ప్రతి శాఖకు తన సహాయ సహకారాలందించిన సౌజన్యమూర్తి వీరు. ఈనాటి యువతకు ఆదర్శంగా నిలవగలిగిన, మూర్తీభవించిన వ్యక్తిత్వం వారిది. తన నడవడికతో ముందు తరాలవారికి సక్రమ మార్గం చూపే "జ్యోతి". అందుకే ఆ మహామూర్తికి స్వధర్మ సేవాసంస్థ 'ధర్మజ్యోతి' బిరుదును ప్రదానం చేసి, సత్కరించింది.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

ప్రతి సంవత్సరం మేమిచ్చే **"ధర్మజ్యోతి"** పురస్కారం ఈ సంవత్సరం మూవీ మొఘల్ పద్మ భూషణ్ డా.డి.రామనాయుడు గారిని వరించింది. 29-03-2013న క్రిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి (పద్మభూషణ్, శాంతాబయోటెక్ రూపశిల్పి) చేతులమీదుగా పురస్కార ప్రదానం జరిగింది. మాజీమంత్రి శ్రీ కోడెల శివప్రసాదరావు, నూజివీడు సీడ్స్ అధినేత శ్రీ మండవ వేంకట్రామయ్య, శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి, శ్రీ సి.హెచ్. మస్తానయ్య, ప్రొ. కడియాల వాసుదేవరావు, శ్రీమతి గద్దె రామతులశమ్మ, శ్రీ లంకా సూర్యనారాయణ ఇంకా పట్టణ ప్రముఖులు అనేకమంది పాల్గొన్నారు.

డా॥ కొండబోలు బసవపున్నయ్య గారు 2014



డా॥ కొండబోలు బసవపున్నయ్య గారు 1933 సం॥లో తెనాలి తాలూకా వేటపాలెంలో జన్మించారు. దీక్షా దక్షతలతో ఉన్నత విద్యలనభ్యసించి, వైద్య విద్యలో స్వర్ణపతక విజేతలై, గుంటూరులో 1960లో వైద్యాలయం ప్రారంభించారు. అత్యల్ప రుసుము తీసుకొని, అసలు తీసుకోకుండా కూడ, వీరు గ్రామీణ ప్రజలకు, బీదలకు వైద్య సహాయ మందించారు.

కార్యదీక్షత, కఠోరశ్రమ వీరికి జన్మతః వచ్చిన సుగుణాలు. గుంటూరు మెడికల్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆ సమయంలోనే, గుంటూరు శాఖను ఉత్తమమైనదిగా ప్రకటించటం జరిగింది. విద్య సాంస్కృతిక, సామాజిక, ధార్మిక సంస్థలకు కొండంత అండ కొండబోలు గారు.

నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ సంస్థాపక సభ్యులుగా విద్యారంగ సేవలను ప్రారంభించి, తొమ్మిది విద్యాలయాలను అత్యంత ప్రతిష్టాత్మక కేంద్రాలుగా తీర్చిదిద్దారు. వివిధ విద్యాసంస్థలకు కార్యదర్శిగా, వ్యవస్థాపకులుగా ఉపాధ్యక్షునిగా, అధ్యక్షునిగా వీరు చేసిన సేవలతో ఆ సంస్థలు విద్యారంగంలో

నేడు అగ్రగాములై విరాజిల్లుతున్నవి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అకడమిక్ సెనెట్ మెంబరుగా వీరు అందించిన సేవలు ఉన్నత విద్యారంగానికి ఊతమిచ్చాయి. కమ్మ విద్యార్థి సహాయ సంఘానికి, కమ్మ జన సేవా సమితికి కాకతీయ విద్యార్థి సంక్షేమ సమితికి అధ్యక్షులై పేద విద్యార్థులకు వీరు చేసిన ఉపకృతి నిరుపమానము.

వదాన్య శేఖరులులైన వీరు చేసిన గుప్తదానాలు లెక్కకు మిక్కిలి. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి, పెదనందిపాడు, అమరావతి కళాశాలలకు, కమ్మ విద్యార్థి సహాయ సంఘం, ఆర్య సమాజం, మహాప్రస్థానాలు బృందావన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, ఇతర దేవాలయాలు, వృద్ధాశ్రమాలు మొదలైన ఎన్నో సంస్థలకు మొత్తం కోటి రూపాయలకు పైగా దానం గావించారు. ఏటా లక్షల రూపాయలు ఇప్పటికీ ఇస్తున్నారు. వీరు నూతనంగా నిర్మించి నిర్వహిస్తున్న ఆశ్రమం, ధర్మశాలలు వీరి వదాన్య కీర్తికి ఎత్తిన పతాకాలు.

ఆంధ్ర భాషాభిమానంతో తుమ్మల కళాపీఠాన్ని స్థాపించి నిరాటంకంగా నడుపుతున్నారు. తెనుగు లెంక సాహిత్య సర్వస్వాన్ని ముద్రించి ఆంధ్ర సాహిత్య సరస్వతికి అమూల్య కంఠాభరణంగా అర్పించారు. ఏటుకూరి సాహిత్య సర్వస్వాన్ని ప్రచురించి పలుకులమ్మకు వెలలేని సేవలు చేసారు. తిక్కన ఉత్సవాలు, సహస్రావధానాలు, భాగవతోత్సవాలు నిర్వహించి, ఆంధ్ర సాహిత్యాభిమానుల అభిమానానికి పాత్రులయ్యారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి వీరు అందుకున్న ప్రతిభాపురస్కారం ఒక "మెచ్చు" తునక మాత్రమే!

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

06-07-2014న డా.బసవపున్నయ్య గారికి "**ధర్మ జ్యోతి**" పురస్కారం రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రివర్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు గారి చేతుల మీదుగా ప్రదానం చేయటం జరిగింది. ఈ సభకు ప్రొ. కడియాల వాసుదేవరావు గారు అధ్యక్షత వహించారు. విశ్రాంత హైకోర్టు జడ్జి శ్రీ జస్టిస్ కె.జి.శంకర్ గారు, గుంటూరు (పశ్చిమ) శాసనసభ్యులు శ్రీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి గారు, డా. యం.గోపాలకృష్ణ గారు, విద్వాన్ గోగినేని కనకయ్య గారు, శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ, శ్రీ గుమ్మడి ఇంకా అనేక విద్యాసంస్థల యాజమాన్యం, పురప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారు 2015



శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్‌గా సుపరిచితులైన (శ్రీ పత్రి వెంకట రామకృష్ణప్రసాద్ గారు) 1941 ఆగష్టులో జన్మించారు. సిరిపురం స్కూల్‌లో, గుంటూరు హిందూ కాలేజిలో, నాగపూర్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశారు. ఎం.ఏ.లో గోల్డ్ మెడలిస్ట్. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి డెవలప్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్‌లో పి.జి. డిప్లమో పొందారు.

రాయపూర్‌లోని రవిశంకర్ శుక్లా విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా ఉద్యోగజీవితం ప్రారంభించి తరువాత ఐ.ఏ.యస్.కు ఎంపికై నల్గొండ జిల్లా భువనగిరి సబ్ కలెక్టర్‌గా, ముఖ్యమంత్రి కార్యదర్శిగా, ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా, విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఛైర్మన్‌గా, ప్రధానమంత్రికి అదనపు కార్యదర్శి హోదాలో పత్రికా సలహాదారుగా, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రథమ సేవకునిగా పనిచేసిన కాలం వారి ఉద్యోగ జీవితానికి శిఖరాయమానం. తిరుమల తిరుపతి దేవస్థానాలలో వీరందించిన సేవలకుగాను కర్నాటకలోని ప్రముఖ సాంస్కృతిక సంస్థలు రాష్ట్రరత్న పురస్కారాన్ని అందజేశారు. వీరు **'హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్'** అధ్యక్షులు. ఆయన బహు గ్రంథ రచయిత కూడ.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గార్కి 14-06-2015న శాసనసభ ఉపసభాపతి మాన్యశ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి చేతుల మీదుగా **"ధర్మజ్యోతి"** పురస్కార ప్రదానం చేయటం జరిగింది. సభకు సంస్థ నూతన అధ్యక్షులు డా. మద్దినేని గోపాలకృష్ణ గారు అధ్యక్షత వహించారు. శాసన మండలి సభ్యులు డా. ఎ.ఎస్. రామకృష్ణ గారు, డా.బసవపున్నయ్యగారు జర్నలిస్ట్ శ్రీ వల్లీశ్వర్ గారు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సభలో స్వధర్మసేవా సంస్థ కమిటీ మెంబరు శ్రీ నన్నపనేని అయ్యన్‌రావు నూతన రాజధాని నిర్మాణానికి విరాళంగా ఇచ్చిన లక్షరూపాయల చెక్కుని డా. బసవపున్నయ్యగారి ద్వారా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి అందజేశారు.

డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు గారు 2016

ప్రముఖ నేత్రవైద్య నిపుణులైన డా.గుళ్లపల్లి నాగేశ్వరరావు హైదరాబాదులోని 'ఎల్వీప్రసాద్ కంటి వైద్యశాల' స్థాపనకు మూలకారకుడు. అంతర్జాతీయ కంటి వైద్యశాస్త్ర రంగంలో 'నాగ్' పేరుతో ప్రఖ్యాతిగాంచిన ఆయన... కంటికి సంబంధించిన వ్యాధులపై 300 పరిశోధన వ్యాసాలు రాశారు. ఆయన ఆధ్వర్యంలో 2,50,000 మందికి కంటి శస్త్ర చికిత్సలు జరిగాయి. వైద్య విభాగంలో ఎంతో కృషి చేయడంతో పాటు అంధత్వ నివారణకు చేసిన సేవలకుగాను నాగేశ్వరరావుకు పద్మశ్రీతోపాటు పలు పురస్కారాలు లభించాయి. పలు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లు ఇచ్చాయి.

డా.నాగేశ్వరరావు 1945 సెప్టెంబర్ 21వ తేదీన కృష్ణాజిల్లా చోడవరం (నాగాయలంక మండలం) లో జన్మించారు. ఆంధ్రక్రైస్తవ కళాశాలలో పి.యు.సి., ఆ తర్వాత గుంటూరు వైద్య కళాశాలలో యం.బి.బి.యస్ పూర్తిచేశారు. అనంతరం ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలో కంటి జబ్బులకు సంబందించిన ప్రత్యేక కోర్సు చేశారు. 1974లో ఉన్నత విద్య కోసం బోస్టన్, అమెరికా వెళ్లారు. రోచస్టర్ విశ్వవిద్యాలయం వైద్య కళాశాలలో వైద్యునిగా, బోధకునిగా 1986 వరకు కొనసాగారు. యల్.వి.ప్రసాద్ తనయుడు రమేష్ ప్రోద్బలంతో హైదరాబాద్‌లో 'యల్.వి.ప్రసాద్ కంటి వైద్యశాల' స్థాపించడానికి మూల కారకుడయ్యారు. అంతేకాదు... ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థగా దానిని రూపొందించారు.

'సామాన్యుడి కష్టసుఖాలు నాకు తెలిసేలా చేసింది మా ఊరే. ఈడుపుగల్లు వంటి పల్లెటూరులో పెరగడం అనేది నా అదృష్టం అనుకుంటాను. పల్లెటూరులో పుట్టి పెరిగిన వారు మెడిసిన్‌లోకి వెళితే మాత్రం మంచి వైద్యులు కాగలరని, బాగా పేరు తెచ్చుకోగలరని నా అభిప్రాయం. ఎందుకంటే... పల్లెటూళ్లో కనీసం కొన్నేళ్లు పెరిగితే సామాన్య మానవుల కష్టసుఖాలు ఏమిటో అర్థమవుతాయి. ఏదో సెలవులకు చుట్టపుచూపుగా వెళితే అర్థమయ్యే విషయాలు కావు అవి. వైద్యులనే కాదు, ఏ రంగంలో రాణించాలన్నా పల్లెటూళ్ల జీవనశైలి తెలిసి ఉండటం మంచిది. మా ఊరే నన్ను మంచి వైద్యుణ్ని చేయడంతోపాటు మంచి వ్యక్తిగా తీర్చిదిద్దింది.' అని ఆయన ఓ సందర్భంలో పేర్కొన్నారు.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

డాక్టర్ జి.నాగేశ్వరరావు గార్కి 'ధర్మజ్యోతి' పురస్కార ప్రదానం 10-04-2016న గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్ గారి చేతులమీదుగా జరిగింది. సభకు సంస్థ అధ్యక్షులు డా.యమ్. గోపాలకృష్ణగారు అధ్యక్షత వహించారు. లోక్‌సభ సభ్యులు శ్రీ రాయపాటి సాంబశివరావుగారు, డా. కె. బసవపున్నయ్యగారు, శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి, శ్రీ సి.హెచ్. మస్తానయ్య గార్లు పట్టణ వైద్యపురప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీ చిటిపోతు మస్తానయ్య 2017



గుంటూరుజిల్లా చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించి, కళాశాల విద్యను నరసరావుపేట ఎస్.ఎస్ & ఎన్. కళాశాలలో అభ్యసించి, బి.కామ్. డిగ్రీ ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు. 1968వ సంవత్సరంలో చార్టర్డ్ అకౌంటెన్సీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ పొందడం వారి ప్రతిభకు తార్కాణం. గుంటూరులో మస్తానయ్య అండ్ కంపెనీ చార్టర్డ్ అకౌంటెంట్స్ పేరుతో, 1969 నుండి ప్రాక్టీస్ మొదలు పెట్టారు.

ప్రముఖ సాంస్కృతిక సంస్థ నాగార్జున కల్చరల్ సెంటర్‌కు కార్యదర్శిగా ఉండి ఎన్నో విశిష్ట సంగీత, నృత్య కార్యక్రమాల నిర్వహణలో ప్రముఖపాత్ర పోషించారు.

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ నిర్మాణం, ప్రతిష్ట జరిగినప్పటినుండి ఉపాధ్యక్షులుగా, 2010నుండి అధ్యక్షులుగా ఉండి ఆర్థిక వ్యవహారాలతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ప్రముఖపాత్ర వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రాక్టీస్ వదలి, దేవాలయ కార్యక్రమాలు,

ఇతర ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ కోశాధికారిగా ఉండి మహాభారతి వైజయంతి, రామాయణ వైజయంతి, యజ్ఞయాగములు మొదలగు కార్యక్రమాల నిర్వహణలో సహకారమందిస్తున్నారు.

కోటప్పకొండదగ్గర కాకతీయ సేవాసమితికి కార్యదర్శిగా ఉండి, 2002 నుండి వేల సంఖ్యలో అన్నదానాలు, సంప్రదాయబద్ధమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయుటలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారు.

చేబ్రోలు హనుమయ్య వాత్సల్య ఆశ్రమము పెదకాకాని, గుంటూరు; పాటిబండ్ల సీతారామయ్య ఉన్నతపాఠశాల కార్యవర్గ సభ్యులుగా ఉండి ఆయా కార్యక్రమాలలో పాలుపంచుకొంటున్నారు. సేవా కార్యక్రమాలకు తనవంతుగా ఆర్థిక సహాయాన్నికూడా అందిస్తున్నారు.

సామాజిక, ధార్మిక తత్పరతకలిగిన శ్రీ చిటిపోతు మస్తానయ్యగారిని ఈ విధంగా సత్కరించుకోవడం ఆనందదాయకం.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

30-04-2017న శ్రీ చిటిపోతు మస్తానయ్య గార్కి గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్‌గారి చేతుల మీదుగా 'ధర్మజ్యోతి' పురస్కార ప్రధానం చేయటం జరిగింది. సభకు సంస్థ అధ్యక్షులు డా. యమ్. గోపాలకృష్ణగారు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మంత్రివర్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుగారు, శ్రీ నక్కా ఆనందబాబుగారు, శాసన సభ్యులు శ్రీ మోదుగుల వేణుగోపాలరెడ్డిగారు, శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌గారు, ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్, శ్రీమతి నన్నపనేని రాజకుమారిగారు, డా. కె. బసవపున్నయ్యగారు, శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తిగారు, నగరంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు 2018

గుంటూరుజిల్లా చిలకలూరిపేట మండలం, కమ్మవారిపాలెం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో సత్యనారాయణగారు జన్మించారు. తల్లిదండ్రులు రామమ్మ, సుబ్బయ్య గార్లు. తెనాలి సమీపంలోని చదవలవాడ గ్రామానికి చెందిన లలితాంబగారిని వివాహం చేసుకున్నారు. వీరు ఆదర్శ దంపతులు.

యజ్ఞయాగాది క్రతువుల నిర్వహణ, నూతన దేవాలయ ప్రతిష్ఠలు, జీర్ణదేవాలయోద్ధరణ, రామాయణ, భారత, భాగవత ప్రవచన శ్రవణము, ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణ వంటి ధార్మిక కార్యక్రమాలలో వీరిరువురు ఒకేమాట, ఒకేబాటగా నడిచారు. వసుధైక కుటుంబమే ధ్యేయంగా గల పవిత్ర ఋషి సంప్రదాయాన్ని, సనాతన ధర్మనిష్ఠను ప్రతిఒక్కరికీ తెలియజేయాలనే సదుద్దేశ్యంతో, విశ్వకళ్యాణ దృష్టితో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్‌ను స్థాపించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఆ పుణ్యదంపతులు అనేకానేక ధార్మిక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. మహాభారత వైజయంతి, మహాభాగవత వైజయంతి, రామాయణ వైజయంతి, గణపతితత్త్వ వైభవము వంటి, అనేక ఉత్తమ గ్రంథాలను ప్రచురించారు. కోటప్పకొండ పుణ్యక్షేత్ర అభివృద్ధిలో వీరిపాత్ర శ్లాఘనీయము.

ధార్మిక నిరతులైన రాజర్షి దంపతులవంటి శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ గార్లను 'ధర్మజ్యోతి' పురస్కారంతో సత్కరించుకోవడం ఆనందదాయకం.

ధర్మజ్యోతి పురస్కార ప్రదానోత్సవము

శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులకు 8-04-2018 న పార్లమెంటు సభ్యులు శ్రీ రాయపాటి సాంబశివరావుగారి చేతులమీదుగా 'ధర్మజ్యోతి' పురస్కార ప్రదానం జరిగింది. సభకు సంస్థ అధ్యక్షులు డా. యం.వ్.



గోపాలకృష్ణగారు అధ్యక్షత వహించారు. శాసన సభ్యులు శ్రీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, శ్రీ జి.వి.ఆంజనేయులుగారు, పూర్వ శాసనమండలి సభ్యులు డా. రాయపాటి శ్రీనివాస్‌గారు, శ్రీ గుమ్మడి రాధాకృష్ణమూర్తి, శ్రీ చిటిపోతు మస్తానయ్య, పట్టణ ప్రముఖులు, ఆధ్యాత్మిక సేవాసంస్థల పెద్దలు పాల్గొన్నారు.

డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ 2019



మనసున్న వైద్యశిఖామణిగా డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ (01.01.1934) గారిని తెలియనివారు గుంటూరులో లేరంటే అతిశయోక్తి లేదు. వైద్యప్రపంచంలో సుప్రసిద్ధులు. ప్రాథమిక విద్యాభ్యాసం నెల్లూరులో. గుంటూరు వైద్యకళాశాల ఆరవ బ్యాచ్ విద్యార్థి. వైద్యవిద్యలో మూడు బంగారు పతకాలు పొందారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో గౌరవ సర్జన్‌గా, గుంటూరు వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. 1961 నుండి గుంటూరు నగరం డాక్టర్‌గారి వైద్యసేవలను పొందుతూ ఉంది. డాక్టర్ గోపాలకృష్ణగారి చేతి చలువ వలననే బ్రతికి బయటపడ్డామని, సంపూర్ణ ఆరోగ్యం పొందామని రోజూ వారిని తలచుకునేవారెందరో ఉన్నారు. ఆర్థికంకన్నా, హార్దికం ముఖ్యం డాక్టర్‌గారికి.

వైద్యరంగంలోనేకాక విద్యారంగంలోకూడా డాక్టర్‌గారు సుప్రసిద్ధులు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శిగా 30 సంవత్సరాలు విశేషమైన సేవలందించారు. ఆయా విద్యాసంస్థలకు, ప్రజాహిత సంస్థలకు భూరి విరాళాలను గుప్తంగా అందించారు. డాక్టర్ కాసరనేని జయప్రదాంబ కళాశాల నిర్మాణానికి విలువైన భూమిని సమర్పించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరుశాఖ అధ్యక్షులుగా ఆ సంస్థ అభివృద్ధికి తోడ్పడ్డారు. ఉదారచరితులు, సహృదయులు, పూజనీయులు, స్నేహశీలి, యువ వైద్యులకు రోల్‌మోడల్, ఎల్లప్పుడూ మోముపై చిరునవ్వులు చిందులు వేస్తూవుండే డాక్టర్ గోపాలకృష్ణగారు ఆదర్శప్రాయమైన ఒక ఉమ్మడి కుటుంబపెద్ద. డాక్టర్‌గారి ఆలోచనాధోరణి ఒక్కటే.

'Let noble thoughts come from all directions'; 'Be good, do good'

మిస్టర్ ఫర్‌ఫెక్ట్‌గా సన్నిహితులతో కొనియాడబడే డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణగారిని 'ధర్మజ్యోతి' పురస్కారంతో అలంకరించడం స్వధర్మ సేవాసంస్థకి ఆనందదాయకం.

మా సేవా కార్యక్రమములు...



స్వధర్మ సేవాసంస్థ

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం
బృందావన్ గార్డెన్స్, 6వ లైను
గుంటూరు-522006
సెల్ : 9491478884